సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 13 । ఏప్రిల్ । 2023



448 టన్నుల చీనీ విక్రయం

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం 448 టన్నుల చీనీకాయల అమ్మకాలు సాగాయి. టన్ను ధర గరిష్టంగా రూ.33వేలు పలికింది.



టమాట కిలో రూ.8

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. మార్కెట్‌కు 25 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
43.3°/ 16.2°

జిల్లాలో బుధవారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. వేసవితాపం కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.



భూగర్భం.. ఖ'నిజం'

- 'అనంత'లో అరుదైన మూలకాల గుర్తింపు
- సెల్ ఫోన్, టీవీలు, ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో కీలకం
- స్క్రీన్ డిస్‌ప్లే, సెమీ కండక్టర్ పరిశ్రమలో విరివిగా వినియోగం

ఏపీ నెట్‌వర్క్ :

అనంతపురం జిల్లా భూగర్భంలో అరుదైన మూలకాలున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించటం కొత్త పరిశోధనలకు తెర తీసింది. హైదరాబాద్‌లోని నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్జీఆర్ఐ)కి చెందిన సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ పి.వి. సుందరరాజు బృందం జిల్లాలో కీలక పరిశోధన చేసింది. వీరి పరిశోధనలో అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో పెద్దఎత్తున అరుదైన మూలకాల (రేర్ ఎర్త్ ఎలిమెంట్స్) నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. అనంతపురం జిల్లాలోని దంచర్ల, దండువారిపల్లి, పెద్దవడుగూరు, రెడ్డిపల్లి, చింతలచెరువు, చిత్తూరు జిల్లాలోని పులికొండ ప్రాంతాల్లో వీటి నిల్వలు ఉన్నట్లు నిర్ధారించారు. భూగర్భంలో అరుదుగా దొరికే ఈ మూలకాలకు ప్రకాశించే తత్వంతో పాటు రసాయనిక చర్యలను వేగవంతం (కేటలిస్ట్) చేసే గుణాలు ఉంటాయి. వీటితో తయారీ రంగంలో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. గాలి మరలు (టర్బయిన్లు), సోలార్ ప్యానల్స్, సెల్‌ఫోన్లు, సెమీ కండక్టర్లు, ఏవియేషన్, ఆటోమొబైల్, స్పేస్ టెక్నాలజీ, మెడికల్ టెక్నాలజీ, శాశ్వత అయస్కాంతాల తయారీ... ఇలా వివిధ వస్తువుల తయారీకి ఉపయోగిస్తున్నారు. మన దేశంలో బీచ్ శాండ్ (సముద్ర తీరంలోని ఇసుక) నుంచి వీటిని వేరు చేసి వాడుతున్నారు. తాజాగా భూమిలోనూ వాటి నిల్వలు ఉన్నట్లు పరిశోధనల్లో గుర్తించారు. అనంతపురం, చిత్తూరు జిల్లాల్లోని రాళ్లలో అల్లనైట్, సెరియేట్, థోరేట్, కొలంబైట్, ట్యాంటలైట్, అపటైట్, జిర్కాన్, మోనజైట్, ఫ్లోరైట్ వంటి 15 రకాల మూలకాలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు. అరుదైన మూలకాలకు ప్రత్యామ్నాయాలను గుర్తించేందుకు కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) సుందరరాజు బృందానికి ప్రాజెక్టు అప్పగించింది. ఆరేళ్లపాటు పరిశోధనలు చేసిన ఈ బృందం అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో మూలకాల లభ్యత ఉన్నట్లు గుర్తించి సీఎస్ఐఆర్‌కు నివేదికను అందించింది. ఈ మేరకు ఈ రెండు జిల్లాల్లో పెద్ద ఎత్తున నిల్వలు ఉన్నట్లుగా పేర్కొన్నారు. దంచర్ల ప్రాంతంలో దాదాపు 18 చదరపు కిలోమీటర్ల పరిధిలో సెనైట్ రాక్ గనులు ఉన్నాయి. ఈ రాళ్లలోనే అరుదైన మూలకాలు ఉన్నట్లు తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లో ఎంత విస్తీర్ణంలో, ఎంత లోతుకు ఉన్నాయనే విషయంపై మరింత అధ్యయనం చేయాల్సి ఉంది.



ఉత్పత్తిలో చైనా టాప్..

చైనాలోని మట్టిలోనే అరుదైన మూలకాలు లభిస్తుండటం ఆ దేశానికి కలిసి వచ్చింది. వాటిని వెలికితీయటం సులువు కావటంతో పాటు తక్కువ వ్యయంతోనే సాధ్యమవుతోంది. ప్రపంచంలోనే అత్యధికంగా చైనాలో 4.4 కోట్ల టన్నులు, వియత్నాంలో 2.2 కోట్ల టన్నులు, ఇండియాలో 69 లక్షల టన్నుల నిల్వలు ఉన్నట్లు ఇప్పటివరకు గుర్తించారు. 2020 సంవత్సరంలో చైనా 1.40 లక్షల టన్నుల మూలకాలను ఉత్పత్తి చేసింది.

- ఉత్పత్తి పరంగా చైనా, అమెరికా, మయన్మార్, ఆస్ట్రేలియా, మడగాస్కర్ తర్వాత ఆరో స్థానంలో ఇండియా ఉంది. ప్రపంచంలోని ఎన్నో దేశాలకు చైనా నుంచే ఈ మూలకాలు ఎగుమతి అవుతున్నాయి. ఇండియా సహా అనేక దేశాలు చైనాపైనే ఆధార పడుతున్నాయి. చైనా నుంచి దిగుమతులు క్రమంగా తగ్గించుకుంటూ మన దేశంలోనే అరుదైన మూలకాలను వెలికితీయాలని శాస్త్రవేత్తలు, పరిశ్రమల నిర్వాహకులు భావిస్తున్నారు.

ఎన్జీఆర్ఐకి లేఖ రాశాం



తాడిపత్రి నియోజకవర్గంలో ఎన్జీఆర్ఐ పరిశోధనలు చేసిందని తెలిసింది. మాకు ఆ సంస్థ నుంచి సమాచారం లేదు. మేము విచారించగా.. ఇది ప్రాథమిక పరిశోధనలు మాత్రమే అని చెప్పారు. పూర్తిస్థాయిలో పరిశోధనలు జరిగాక రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపనున్నట్లు తెలిసింది. దీనిపై మేము కూడా ఎన్జీఆర్ఐకి లేఖ రాశాం.

–నాగయ్య, డిప్యూటీ డైరెక్టర్, మైనింగ్ విభాగం, అనంతపురం

న్యూస్‌రీల్

నేడు బాధ్యతలు చేపట్టనున్న నూతన ఎస్పీ



ఎస్.వి.మాధవ రెడ్డి

కొత్తచెరువు: జిల్లా నూతన సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ)గా నియమితులైన ఎస్.వి.మాధవ రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టనున్నారు. బుధవారం రాత్రే ఆయన ప్రశాంతి నిలయంలోని శాంతిభవన్ చేరుకున్నారు. గురువారం ఉదయం సత్యసాయిబాబా మహాసమాధి దర్శనానంతరం ఎస్పీగా బాధ్యతలు చేపట్టనున్నట్లు పోలీసు అధికార వర్గాలు తెలిపాయి.

19న అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు

పుట్టపర్తి అర్బన్: అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 19న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంతో పాటు కదిరి, ధర్మవరం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాల్లో ఆయా మండలాల పరిధిలోని అభ్యర్థులకు ఉదయం 10 గంటలకు, పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయని వెల్లడించారు. అభ్యర్థులు కాల్ లెటర్, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

సీడీపీఓ వరలక్ష్మిని విచారించిన ఆర్జేడీ



మాట్లాడుతున్న ఆర్జేడీ పద్మజ

కదిరి టౌన్: కదిరి పడమర ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ వరలక్ష్మిపై వచ్చిన ఆరోపణలపై ఆర్జేడీ పద్మజ బుధవారం విచారణ చేపట్టారు. సీడీపీఓ వరలక్ష్మి అమడగూరు, ఓడీ చెరువు మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు ఉన్నప్పటికీ, అద్దె చెల్లించినట్లు బిల్లులు డ్రా చేశారని ఆయా మండలాల ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆర్జేడి పద్మజ బుధవారం ఐసీడీఎస్ కార్యాలయానికి విచ్చేశారు. సీడీపీఓను విచారించగా, తనకు ఎలాంటి సంబంధం లేదని ఆమె సమాధానం ఇచ్చారు. గతంలో ఉన్న వారు బిల్లులు డ్రా చేశారేమో తనకు తెలియదన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆర్జేడీ...విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని వెల్లడించారు.

వాల్మీకి మహిళకు అరుదైన గౌరవం

- ఎమ్మెల్సీగా ప్రమాణం చేసిన మంగమ్మ
- ఆనందోత్సాహాల్లో జిల్లా వాల్మీకులు
- సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



ప్రమాణ స్వీకారం అనంతరం మండలి చైర్మన్ మోషేను రాజుతో బ్యాగు అందుకుంటున్న ఎమ్మెల్సీ మంగమ్మ, చిత్రంలో ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ: రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి వాల్మీకీ మహిళ శాసన మండలిలో అడుగుపెట్టారు. అనంతపురం స్థానిక సంస్థల నియోజకవర్గం స్థానం నుంచి వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేసి ఏకగ్రీవంగా ఎన్నికైన హిందూపురం మాజీ పార్లమెంట్ సభ్యులు సానిపల్లి గంగాధర్ సతీమణి సానిపల్లి మంగమ్మ బుధవారం వెలగపూడిలోని శాసన సభ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన పలువురు వాల్మీకులు పాల్గొన్నారు. మంగమ్మ ప్రమాణం స్వీకారం చేయగానే..జయహో జగన్ అంటూ నినదించారు. తొలిసారి శాసన మండలిలో వాల్మీకులకు, అందునా ఓ మహిళకు స్థానం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లాలోని వాల్మీకులంతా కృతజ్ఞతలు తెలిపారు.

మహిళల మోములో చిరునవ్వే లక్ష్యం

- వైఎస్సార్ ఈబీసీ నేస్తం ప్రారంభోత్సవంలో కలెక్టర్ అరుణ్‌బాబు



మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు

పుట్టపర్తి అర్బన్: మహిళ ముఖంలో చిరునవ్వు ఉంటే... ఆ కుటుంబమంతా సంతోషం ఉంటుందని, దీన్ని నమ్మిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. బుధవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకాశం జిల్లా మార్కాపురం బహిరంగ సభ నుంచి 'వైఎస్సార్ ఈబీసీ నేస్తం' పథకం కింద అర్హులైన అగ్రవర్ణ మహిళలకు రెండో విడత సాయాన్ని బటన్ నొక్కి ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని 'స్పందన' హాలు నుంచి కలెక్టర్ అరుణ్ బాబు, డీఆర్ఓ కొండయ్య, పుడా చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్లు శ్రీలక్ష్మి, తిప్పన్న బీసీ కార్పొరేషన్ ఏఈఓ విజయలక్ష్మి, లబ్ధిదారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం కలెక్టర్ ప్రజాప్రతినిధులతో కలిసి జిల్లాలోని 16,467 మంది 'వైఎస్సార్ ఈబీసీ నేస్తం' లబ్ధిదారులకు రూ.24.70 కోట్ల మెగాచెక్కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...అగ్రవర్ణ కులాల్లోనూ పేదలున్నారని గుర్తించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారికి ఆర్థిక అండనిచ్చి ఆదుకుంటున్నారన్నారు. ఈ సాయాన్ని సద్వినియోగం చేసుకుని కుటుంబ రాబడిని పెంచుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. 'వైఎస్సార్ ఈబీసీ నేస్తం' కింద 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన అగ్రవర్ణ పేద మహిళల జీవనోపాధులు మెరుగుపరిచేందుకు ఏడాదికి రూ.15 వేల చొప్పున మూడేళ్ల పాటు రూ.45 వేలు అందజేస్తామన్నారు. గత ఏడాది మొదటి విడతలో 16,028 మంది లబ్ధిదారులకు రూ.24.04 కోట్లు అందించిన విషయాన్ని గుర్తు చేశారు.

కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని 'పుడా' చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ, పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్లు శ్రీలక్ష్మి, తిప్పన్న అన్నారు. ఇప్పటి వరకూ 98 శాతం హామీలు అమలు చేసి దేశంలోనే నంబర్ వన్ సీఎంగా జగన్ గుర్తింపు పొందారన్నారు. అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలతో పాటు పేద ఓసీలకు సంక్షేమాన్ని అందజేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. ఈ క్రమంలోనే 'వైఎస్సార్ ఈబీసీ నేస్తం'లో కమ్మ వర్గానికి చెందిన వారు 2,078 మంది, రెడ్లు 12,225 మంది, ఆర్యవైశ్యులు 1,302 మంది, బ్రాహ్మణులు 557 మంది, క్షత్రియులు 8 మంది, వెలమలు 55 మంది, ఇతర ఓసీ కులాలకు చెందిన వారు 242 మంది ఉన్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ జనరంజక పాలనకు ఇదే నిదర్శనమన్నారు.

గతంలో ఇలాంటి పథకాలు లేవు



గత ప్రభుత్వాలు ఇలాంటి పథకాలను ఎప్పుడూ అమలు చేయలేదు. మహిళల కోసం పారదర్శకంగా పథకాలు అమలు చేస్తున్న ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుంది. గతంలో కంటి తుడుపుగా పథకాలు అమలు చేశారే తప్ప, ఇంటికే లబ్ధి చేకూర్చలేదు. ఈబీసీ నేస్తం పథకానికి నేను మొదటి సారి అర్హత సాధించాను. చాలా సంతోషంగా ఉంది.

– వెంకటనారాయణమ్మ, పుట్టపర్తి

జగనన్నకే మా మద్దతు



రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది అక్కా చెల్లెమ్మల ఆశీర్వాదాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతాయి. 'వైఎస్సార్ ఈబీసీ నేస్తం' ద్వారా నాకు రెండోసారి రూ.15 వేలు అందుతోంది. దీన్ని ఉపయోగించుకొని పాడిని అభివృద్ధి చేసుకుంటా. సీఎం జగన్ రుణం ఎప్పుడూ... ఎవ్వరూ తీర్చుకోలేనిది. ఆయన చల్లగా ఉండాలి.

– సుశీల, ఎనుములపల్లి

మా గుండెల్లో కొలువై ఉంటారు



అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల గుండెల్లో చిరస్థాయిగా కొలువై ఉంటారు. జీవితాంతం ఆయనే ముఖ్యమంత్రిగా ఉంటే మహిళలు తప్పకుండా మహారాణులవుతారు. ఇందులో ఎలాంటి సందేహం లేదు. నాకు 'వైఎస్సార్ ఈబీసీ నేస్తం' కింద రెండోసారి లబ్ధి కలిగింది.

– లక్ష్మీదేవి, బ్రాహ్మణపల్లి

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం
- పోతులనాగేపల్లి లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాల పరిశీలన



ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలని అధికారులను ఆదేశిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ధర్మవరం: జగనన్న కాలనీల్లోని లేఅవుట్లలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలన్నీ వేగవంతం కావాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. బుధవారం ఆయన ధర్మవరంలోని పోతులనాగేపల్లి జగనన్న హౌసింగ్ లేఅవుట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పలు ఇళ్ల నిర్మాణాలు పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, పోతులనాగేపల్లి జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో 2,086 ఇళ్లు మంజూరుకాగా, 314 పూర్తయ్యాయన్నారు. ఆర్సీ స్థాయిలో 46, ఆర్ఎల్ స్థాయిలో 159, బేస్మెంట్ స్థాయిలో 1,417, బిలో బేస్మెంట్ స్థాయిలో 143 ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయన్నారు. మరో 7 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభంకాలేదన్నారు. ఇక్కడే ఉన్న రెండో లేఅవుట్‌లో 3,130 ఇళ్లు మంజూరు కాగా, 121 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. ఆర్సీ స్థాయిలో 31, ఆర్ఎల్ స్థాయిలో 115, బేస్మెంట్ స్థాయిలో 1,907, బిలో బేస్మెంట్ స్థాయిలో 728 ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయన్నారు. మరో 228 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభంకాలేదన్నారు. అధికారులు ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడాలన్నారు. బేస్మెంట్ స్థాయిలో, ఆర్ఎల్ స్థాయిలో ఆగిపోయిన ఇళ్ల పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేసేలా చూడాలన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

జగనన్న హౌసింగ్ లేఅవుట్లలో అవసరమైన మౌలిక వసతులన్నీ వెంటనే కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పోతులనాగేపల్లి లేఅవుట్‌లో తాత్కాలికంగా నీటి సరఫరా ఇవ్వాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శాశ్వత తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈకి ఫోన్ ద్వారా ఆదేశించారు. ఇప్పటికే ఇక్కడ కొన్ని ఇళ్లు కాగా, కొన్ని కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. అందువల్ల వెంటనే వీధిలైట్లు ఏర్పాటు చేయాలన్నారు. వార్డు అమినిటీస్ సెక్రటరీలు లబ్ధిదారుల జాబితా, ఇళ్ల నిర్మాణాల ప్రగతికి సంబంధించిన వివరాలన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, లబ్ధిదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం మార్కెట్‌యార్డులోని పౌరసరఫరాల సంస్థ గోడౌన్లను కలెక్టర్ తనిఖీ చేశారు. గోడౌన్లలో స్టాక్... చేపట్టాల్సిన మరమ్మతు తదితర అంశాలపై ఆరా తీశారు. గోడౌన్‌లలో ఈవీఎంలు భద్రపరిచేందుకు వీలవుతుందా అని ఆర్డీఓ తిప్పేనాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట డిప్యూటీ కలెక్టర్ భవానీశంకర్, ఇన్‌చార్జ్ హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, ఆర్డీఓ తిప్పేనాయక్, హౌసింగ్ ఈఈ చంద్రశేఖర్, డీఈ మునీశ్వర్‌నాయుడు, ఏఈ బాలాజీ, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ యోగేశ్వరిదేవి, మార్కెటింగ్ ఏడీ మూర్తి, కార్యదర్శి రంగనాథ్, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

పాతికేళ్లకు మాస్టార్లుగా మురిశారు

- తొలిరోజు 98-డీఎస్సీ అభ్యర్థుల కౌన్సెలింగ్ ప్రశాంతం
- 280 మందిలో 251 మంది హాజరు
- 29 మంది అభ్యర్థుల గైర్హాజరు
- వంద మందికి నియామక ఉత్తర్వులు
- నేడు 281 నుంచి 536 నంబరు వరకు కౌన్సెలింగ్





కౌన్సెలింగ్‌కు హాజరైన 98 - డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు, సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న 98-డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు

రాప్తాడు రూరల్: పాతికేళ్ల తర్వాత ఉద్యోగం సాధించిన అభ్యర్థుల్లో సంతోషం వెల్లివిరిసింది. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీని సీఎం వైఎస్ జగన్ నెరవేర్చడంతో వారిలో ఉత్సాహం ఉరకలెత్తింది. తమ కల సాకారమైనందుకు ఆనందంలో ఉబ్బితబ్బిబ్బయ్యారు. నియామక ఉత్తర్వులు అందుకుని మురిసిపోయారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డీఎస్సీ - 98లో అర్హత సాధించిన అభ్యర్థులు 536 మంది ఉన్నారు. అనంతపురం శారదానగర్‌లోని జిల్లా సైన్స్ సెంటర్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. తొలిరోజు బుధవారం 1 నుంచి 280వ నంబరు వరకు కౌన్సెలింగ్‌కు పిలవగా.. 251 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వివిధ కారణాల వల్ల 29 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 1 గంటకు ప్రారంభమైన కౌన్సెలింగ్ సాయంత్రం 6.30 గంటల వరకు సాగింది. డీఈఓ ఎం.సాయిరామ్ దగ్గరుండి పర్యవేక్షించారు. కౌన్సెలింగ్ ప్రారంభానికి ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కరతాళ ధ్వనులతో కృతజ్ఞతలు తెలియజేశారు. కౌన్సెలింగ్ పూర్తయిన వారిలో 100 మందికి నియామక ఉత్తర్వులు అందజేశారు. తక్కిన వారికి గురువారం అందజేయనున్నారు. కాగా.. రెండో రోజు గురువారం ఉదయం పది గంటలకు 281 నుంచి చివరి 536 నంబరు వరకు అభ్యర్థులకు కౌన్సెలింగ్ ఉంటుందని డీఈఓ తెలిపారు.

మీ కలలను సాకారం చేసిన ప్రభుత్వం

కౌన్సెలింగ్‌లో ముందుగా డీఈఓ సాయిరామ్ అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ 98-డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల కలలను రాష్ట్ర ప్రభుత్వం సాకారం చేసిందన్నారు. కేటగిరీ-3, 4 స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోస్టులు మంజూరై టీచర్లు లేని పాఠశాలలు, విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండి టీచర్లు తక్కువగా ఉన్న పాఠశాలలను తొలి ప్రాధాన్యతగా తీసుకున్నామన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో శ్రీసత్యసాయి జిల్లా డీఈఓ మీనాక్షి, అనంతపురం, గుత్తి డిప్యూటీ డీఈఓలు పద్మవాణి, శంకరప్రసాద్, డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్లు శ్రీనాథ్, ఆదినారాయణ, ఏఎస్ఓ ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

మా దేవుడు జగన్

'దశాబ్దాలుగా పెండింగ్ ఉన్న సమస్యను పరిష్కరించి మా జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా పాలిట దేవుడు. జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటాం' అని 98-డీఎస్సీ అభ్యర్థులు ఉద్వేగభరితంగా సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం అనంతపురంలోని సైన్స్ సెంటర్‌లో 98-డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు, వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముఖ్యమంత్రికి, తమ తరఫున కృషి చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి.కల్పలత, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర నాయకులు కేశవరపు జాలిరెడ్డి, ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

సమన్వయంతో పనిచేయండి



జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ పరిశీలకులతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపు

సాక్షి, తిరుపతి: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలని రాష్ట్ర మంత్రి, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి పీఎల్ఆర్ గ్రాండ్‌లో బుధవారం చిత్తూరు, అన్నమయ్య, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, నియోజకవర్గ పరిశీలకులతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమావేశం నిర్వహించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని తెలిపారు. ఇచ్చిన హామీల్లో 98.44 శాతం అమలుచేసిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు. 27 నియోజకవర్గాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై సమీక్షించారు. రోజుకు రెండు నియోజకవర్గాల్లో పర్యటించనున్నట్లు పార్టీ నాయకులకు తెలిపారు. అందరినీ సమన్వయపరచి అత్యధిక స్థానాల్లో పార్టీ విజయం సాధించేందుకు కృషి చేయాలని నాయకులకు సూచించారు.

క్లుప్తంగా

డిగ్రీ నాల్గో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ నాల్గో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫలితాలను జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు.

బెటాలియన్‌లో క్యాంటీన్ ఏర్పాటు



క్యాంటీన్ ప్రారంభిస్తున్న కమాండెంట్ అజిత వెజెండ్ల దంపతులు

బుక్కరాయసముద్రం: మండలంలోని జంతలూరు సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో క్యాంటీన్‌ను కమాండెంట్ అజిత వెజెండ్ల, శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్‌సింగ్ దంపతులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో బెటాలియన్‌లో మెన్ క్యాంటీన్‌తో పాటు ఎంటీ ఆఫీస్ ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, డీఎస్పీ రమణమూర్తి, బెటాలియన్ యూనియన్ అధ్యక్షుడు పెద్దయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బడికి పొమ్మంటే.. ఆత్మహత్యాయత్నం చేశాడు!



చికిత్స పొందుతున్న బాలకృష్ణ

ధర్మవరం అర్బన్: సక్రమంగా బడికెళ్లి చదువుకోవాలని తండ్రి మందలించడంతో ఓ విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని గిర్రాజు కాలనీకి చెందిన రమేష్, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు బాలకృష్ణ.. సత్యసాయినగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్నాడు. ఇటీవల కుమారుడు సక్రమంగా బడికి వెళ్లడం లేదని గుర్తించిన తండ్రి బుధవారం ఉదయం మందలించాడు. బుద్ధిగా చదువుకుని ప్రయోజకుడివి కావాలని హితవు పలికారు. దీంతో మనస్తాపం చెందిన బాలకృష్ణ... తల్లిదండ్రుల కళ్లుగప్పి ఇంట్లో ఉన్న మాత్రలు మింగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయాన్ని గమనించిన తల్లిదండ్రులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు చికిత్స చేస్తున్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చిన్నారులపై 'వాత్సల్యం'

- ఆధారం లేని పిల్లలకు సర్కారు సాయం
- నెలకు రూ.4 వేల ఉపకార వేతనం
- జిల్లాలో ఇప్పటికే 5,200 దరఖాస్తులు
- 'వాత్సల్య' దరఖాస్తుకు ఈనెల 15 వరకూ గడువు

పుట్టపర్తి అర్బన్: బతికేందుకు ఎలాంటి ఆధారం లేని అనాథ పిల్లల కనీస అవసరాలు తీర్చి ఆర్థిక చేయూత ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం 'మిషన్ వాత్సల్య' పథకాన్ని ప్రవేశ పెట్టింది. తల్లిదండ్రులు లేకున్నా, తల్లి / తండ్రి లేకున్నా ఇతరులపై ఆధారపడి జీవిస్తున్న 18 ఏళ్లలోపు పిల్లలకు విద్య, వైద్యం అందించడంతో పాటు వారి అభ్యున్నతే లక్ష్యంగా ప్రతి నెలా రూ.4 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనుంది. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈనెల 15వ తేదీలోపు ఆన్‌లైన్, లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు సీడీపీఓ కార్యాలయానికి పంపాల్సి ఉంటుంది.

ఇప్పటికే 5,200 దరఖాస్తులు

జిల్లాలో 2,824 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, కార్యకర్తలు వారి పరిధిలోని ఇంటింటికీ వెళ్లి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నారు. ఇలా ఇప్పటి వరకూ 5,200 దరఖాస్తులు అందాయి. బ్యాంకు ఖాతాలు ప్రారంభం, కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందక చాలా మంది దరఖాస్తు చేసుకోలేదు. ఇటీవల 7, 8, 9 తేదీల్లో బ్యాంకులకు, తహసీల్దార్ కార్యాలయాలకు, సచివాలయాలకు సెలవులు కావడంతో ఆయా ధ్రువీకరణ పత్రాలు పొందడం ఆలస్యమవుతోంది. ఈ క్రమంలోనే సోమవారం వందలాది మంది బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వాత్సల్య దరఖాస్తుకు గడువు మరింత పెంచితే బాగుంటుందని ఆశిస్తున్నారు.



ఐసీడీఎస్ కార్యాలయానికి చేరిన దరఖాస్తులు

అర్హతలు ఇలా..

- తల్లిదండ్రులను కోల్పోయిన వారు, తల్లిదండ్రులకు దూరమైన వారు, తల్లిని లేదా తండ్రిని కోల్పోయిన వారు అర్హులు. తల్లిదండ్రులు చట్టబద్ధంగా విడిపోయిన వారి పిల్లలూ అర్హులే. కుటుంబం వదిలేసిన చిన్నారులు, తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధితో బాధ పడుతున్న వారు, పేద రికంతో ఇంటి పెద్దను కోల్పోయిన చిన్నారులు దరఖాస్తు చేసుకోవచ్చు. బాలల న్యాయ ఆదరణ, సంరక్షణ చట్టం -2015 ప్రకారం ఇల్లు లేని పిల్లలు, ప్రకృతి వైపరీత్యానికి గురైన బాల కార్మికులు, అక్రమ రవాణ/ దాడులకు గురైన బాలలు, బాల యాచకులు, బాల్య వివాహాలకు గురైనవారు, హెచ్‌ఐవీ బాధిత బాలలు, దివ్యాంగులు, కోవిడ్‌తో తల్లిదండ్రులు కోల్పోయినవారు పిల్లలు మిషన్ వాత్సల్యకు అర్హులు.

వార్షిక ఆదాయ పరిమితి

వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలు మించరాదు. మిషన్ వాత్సల్య స్కాలర్ షిప్పు అందుకుంటున్న బాలలు ఏదైన వసతి గృహం, బాల సదన్‌లలో చేర్పిన తర్వాత ఆర్థిక సాయాన్ని నిలిపి వేస్తారు. ప్రత్యేక అవసరాలు కలిగిన బాలలు మినహా 30 రోజులకు పైగా సక్రమంగా పాఠశాలలకు హాజరు కాలేదని తేలితే పరిశీలించి ఆర్థిక సాయాన్ని నిలిపివేస్తారు.

జత చేయవలసిన పత్రాలు

బాలుడి/బాలిక జనన ధ్రువీకరణపత్రం, ఆధార్ కార్డు, తల్లి, తండ్రి ఆధార్ కార్డు, తల్లి, తండ్రి డెత్ సర్టిఫికెట్, మరణ కారణం, సంరక్షకుల ఆధార్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణపత్రం, బాలుడు/బాలిక పాస్‌పోర్టు సైజ్ ఫొటో, స్టడీ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతా(వ్యక్తి గత, సంరక్షకులతో కలిసి) జిరాక్సు ప్రతి ఇవ్వాల్సి ఉంటుంది.

దరఖాస్తుల పరిశీలన

సీడీపీఓ కార్యాలయాని వచ్చిన దరఖాస్తులన్నింటినీ మండల స్థాయి పరిశీలన కమిటీ (తహసీల్దారు, ఎంపీడీఓ, ఎంఈఓ, సీడీపీఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్) పరిశీలిస్తుంది. ఎంపిక చేసిన దరఖాస్తులపై కమిటీ సభ్యులు సంతకాలు చేసి వాటిని ఐసీడీఎస్ కార్యాలయానికి పంపుతారు. అక్కడ మళ్లీ పరిశీలించి అర్హుల తుది జాబితాను విడుదల చేయనున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సంప్రదించాలి



వాత్సల్య పథకానికి అర్హులు సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సంప్రదించి దరఖాస్తులను కార్యకర్తలకు అందజేయాలి. కమిటీ సభ్యులు అన్ని వివరాలు పరిశీలించి ప్రభుత్వానికి పంపుతారు. ప్రభుత్వం ఆమోదించిన వెంటనే అర్హులకు ప్రతి నెలా రూ.4 వేల చొప్పున అందజేస్తారు.

– లక్ష్మీకుమారి, పీడీ, ఐసీడీఎస్

తహసీల్దార్ కార్యాలయంలో నాగుపాము



కార్యాలయంలో ఉన్న నాగుపాము

రొద్దం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నాగుపాము కనిపించడంతో ఉద్యోగులు భయాందోళనకు గురయ్యారు. బుధవారం ఉదయం కార్యాలయం తలుపులు తెరిచి ఉద్యోగులు విధుల్లో నిమగ్నమవుతుండగా ఒక్కసారిగా పాము కనిపించింది. దీంతో స్థానికుల సాయంతో ఆ పామును సంచిలో బంధించి ఊరి బయట వదిలేయించినట్లు తహసీల్దార్ అనంతాచారి తెలిపారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



పూడికతీత పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామాంజనేయులు

గాండ్లపెంట: ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య మరింత పెంచాలని సిబ్బందిని డ్వామా పీడీ రామాంజనేయులు ఆదేశించారు. గాండ్లపెంట మండలం బూర్లకుంటలో అమృత్ సరోవర్ పథకంలో భాగంగా చేపట్టిన చెరువులో పూడిక తీత పనులను బుధవారం ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపించడంపై అసహనం వ్యక్తం చేశారు. పండ్ల మొక్కల పెంపకంపై ఉన్న మెట్టభూముల రైతులనుంచి దరఖాస్తులు స్వీకరించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అంజినప్ప, ఏపీడీ రోహినాబేగం, ఏపీఓ మంజునాథ్, ఈసీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఎన్పీకుంట: ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతి కూలీకి రోజూ రూ.272 కూలి దక్కేలా చూడాలని సిబ్బందిని డ్వామా పీడీ రామాంజనేయులు ఆదేశించారు. ఎన్పీకుంట మండలం గోవిందురాజులపల్లి, జౌకల గ్రామాల్లో చేపట్టిన పూడికతీత పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల మేరకు పనులు చేస్తే రోజూ రూ.272 కూలి చెల్లిస్తారని కూలీలకు సూచించారు. ప్రతి ఒక్కరికీ వంద రోజులు పనులు కల్పిస్తామన్నారు. జౌకల గ్రామంలో మెగా వాటర్‌షెడ్ పథకం కింద చేపట్టిన చెక్‌డ్యాం పనులు తనిఖీ చేశారు.

అంకితభావంతో పని చేయండి

- జెడ్పీ ఉద్యోగులకు డిప్యూటీ సీఈఓ అమృతరాజ్ ఆదేశం

అనంతపురం సిటీ: అప్పగించిన పనిని అంకితభావంతో పూర్తి చేయాలని జెడ్పీ ఉద్యోగులను డిప్యూటీ సీఈఓ అమృతరాజ్ ఆదేశించారు. డిప్యూటీ సీఈఓగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఆయన కార్యాలయంలోని అన్ని సెక్షన్ల ఉద్యోగులతో బుధవారం సమావేశమై సెక్షన్ల వారీగా అన్ని అంశాలను సమీక్షించారు. ఏ ఒక్క ఫైలు పెండింగ్‌లో ఉంచడానికి వీల్లేదన్నారు. పరస్పర సహకారంతో సకాలంలో పనులు పూర్తి చేయాలని సూచించారు. క్రమశిక్షణ, సమయ పాలన అవసరమన్నారు. పని వేళల్లో అనవసర తిరుగుళ్లు మానుకోవాలని హితవు పలికారు. సమస్య లేమైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే సీఈఓ, చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకుంటానన్నారు. సమావేశంలో పరిపాలనాధికారులు అశ్వత్థప్ప, హనుమంతరెడ్డి, రవిప్రసాద్, నాగేంద్ర, కృష్ణమోహన్, తిప్పయ్య, శ్రీనివాసులు, ధనుంజయ, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అమృతరాజ్

సింహ వాహనంపై చౌడేశ్వరీదేవి

అమడగూరు: స్థానిక చౌడేశ్వరీ దేవి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సింహ వాహనంపై భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. ఉత్సవానికి ఉభయదారులుగా జెడ్పీటీసీ సభ్యురాలు కడగుట్ట కవిత, శివశంకర్‌రెడ్డి దంపతులు వ్యవహరించారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం హంసవాహనంపై అమ్మవారిని ఊరేగించనున్నారు.



భక్తులకు దర్శనమిస్తున్న చౌడేశ్వరమ్మ

సుర్రుమంటున్న సూరీడు

- 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- ఉమ్మడి జిల్లాలో పెరిగిన వేసవితాపం
- ఉక్కపోత, వడదెబ్బ నుంచి జాగ్రత్తలు తప్పనిసరి

అనంతపురం అగ్రికల్చర్: భానుడు భగభగమంటున్నాడు. పగటి పూట తీవ్రమైన ఎండలతో సెగలు కక్కిస్తున్నాడు. అర్ధరాత్రి నుంచి వేకువజాము వరకు కాస్తంత చల్లటి వాతావరణం ఏర్పడటం కొంతలో కొంత ఉపశమనం. అనూహ్యంగా రెండు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పది రోజులుగా పగటిపూట వేసవితాపం తీవ్రస్థాయిలో కొనసాగుతోంది. బుధవారం శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లిలో 43.3 డిగ్రీలు, అనంతపురం జిల్లా తాడిపత్రిలో 42.6 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత కావడం విశేషం. గత 15 రోజులుగా పగలు 37 నుంచి 41 డిగ్రీలు, రాత్రిళ్లు 19 నుంచి 26 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. అయితే గత రెండు రోజులగా పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు మాత్రం 16 నుంచి 21 డిగ్రీల మధ్య నమోదు కావడం విశేషం. దీంతో జిల్లా వ్యాప్తంగా అరుదైన వాతావరణం కొనసాగుతోంది. బుధవారం యల్లనూరు, బొమ్మనహాళ్, గుంతకల్లు, గుమ్మఘట్ట, కళ్యాణదుర్గం, పెద్దవడుగూరు, గుత్తి, కూడేరు, శింగనమల, యాడికి, శెట్టూరు, పుట్లూరు, అనంతపురం, విడపనకల్లు, కంబదూరు, నార్పల, ఆత్మకూరు, అలాగే తాడిమర్రి, ముదిగుబ్బ, ధర్మవరం, పరిగి, రామగిరి, కనగానపల్లి, ఎన్పీ కుంట, పెనుకొండ, కొత్తచెరువు, పుట్టపర్తి, తలుపుల మండలాల్లో పగటి ఉష్ణోగ్రతలు 40 నుంచి 42 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. మిగతా మండలాల్లో 38 నుంచి 40 డిగ్రీల మధ్య కొనసాగాయి.



జాగ్రత్తలు తప్పనిసరి

ఈ నెల చివరి వారం లేదా మే నెలలో గరిష్ట ఉష్ణోగ్రత 45 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. భానుడి ప్రతాపానికి బెంబేలెత్తే పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. ఉదయం పదింటికే ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాగునీరు, మజ్జిగ, కొబ్బరినీళ్లు, తాటిముంజలు, ఓఆర్ఎస్, ఇతరత్రా పండ్లరసాలు ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకపోవడం మంచిదని చెబుతున్నారు. వదులుగా ఉండే వస్త్రాలు ధరించడం, ఉప్పు, నీరు, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం, రోజుకు కనీసం 7 నుంచి 8 లీటర్ల నీళ్లు తీసుకుంటే వడదెబ్బబారి నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు. పిల్లలు, వృద్ధులు, రోగగ్రస్తులు మరింత జాగ్రత్తలు పాటించాలని హెచ్చరిస్తున్నారు.

ఆసక్తిగా గాడిదల పరుగు పందెం



పోటీలో దూసుకెళుతున్న గాడిదలు

వజ్రకరూరు: స్థానిక జనార్దన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఏపీ మండల రజకసంఘం ఆధ్వర్యంలో గాడిదల పరుగు పందెం ఆసక్తిగా జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక నుంచి ఆరు గాడిదలను పోషకులు పట్టుకువచ్చారు. పోటీలను చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో వజ్రకరూరు జనసంద్రమైంది. రాయదుర్గం నియోజకవర్గం రంగసముద్రం నివాసి మల్లేష్‌కు చెందిన గాడిద ప్రథమ స్థానం, కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా ఆకులరాంపురం నివాసి మడివాలప్పకు చెందని గాడిద ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నాయి. ఈ సందర్భంగా విజేతలకు నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు. రజక సంఘం మండల అధ్యక్షుడు సురేంద్ర, నాయకులు గురుమూర్తి, సురేష్, సునీల్, ,ధనుంజయ, గుండాల సుధ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిప్పంటుకుని యువకుడి మృతి

హిందూపురం: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురంలోని బోయపేటకు చెందిన సుధాకర్ (31), తల్లితో కలసి జీవిస్తున్నాడు. వివాహం కాలేదు. మద్యానికి బానిస బుధవారం మధ్యాహ్నం అతిగా మద్యం సేవించి, ఇంటిపైనున్న గదిలో పడుకుని సిగరెట్ తాగుతూ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆ సమయంలో పరుపుపై పడిన సిగరెట్ కారణంగా మంటలు చెలరేగి సుధాకర్‌ను చుట్టుముట్టాయి. గది నుంచి దుర్వాసన వస్తుండడంతో చుట్టుపక్కల వారి నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అప్పటికే మంటల్లో కాలిపోయి సుధాకర్ మృతిచెందినట్లు గుర్తించి, మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వివాహిత బలవన్మరణం

పెనుకొండ రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపం చెందిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... పెనుకొండ మండలం వెంకటగిరి పాళ్యం గ్రామానికి చెందిన జాహ్నవి (18)కి గత ఏడాది డిసెంబర్‌లో సమీప బంధువైన మహేష్‌తో వివాహమైంది. ఇటీవల దంపతుల మధ్య మనస్పర్థలు చెలరేగి తరచూ గొడవ పడేవారు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న జాహ్నవి బుధవారం సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రైతుల అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు చేయాలి

బుక్కరాయసముద్రం: రైతుల అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు చేయాలని శాస్త్రవేత్తలకు పరిశోధన సంచాలకులు డాక్టర్ ప్రశాంతి, విస్తరణా సంచాలకులు సుబ్బరామిరెడ్డి సూచించారు. బుధవారం రేకులకుంట ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా అత్యల్ప వర్షపాత మండల పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ ప్రశాంతి, సుబ్బరామిరెడ్డి హాజరై మాట్లాడారు. వ్యవసాయ రంగంలో నూతన టెక్నాలజీను రైతులకు పరిచయం చేయాలని సూచించారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడినిచ్చే విత్తన వంగడాలను రైతులకు అందించాలన్నారు. మహిళా రైతులకు విలువ ఆధారిత ఉత్పత్తుల మీద శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం వ్యవసాయ పనిముట్లను పరిశీలించి, వివిధ పంటల సాగుపై ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వర్లు, రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, అనంతపురం, శ్రీసత్యసాయి, నంద్యాల, కర్నూలు జిల్లాల వ్యవసాయ అధికారులు చంద్రానాయక్, వైవీ సుబ్బారావు, మోహన్‌రావు, వరలక్ష్మి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్లు రాజశేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, మహేశ్వరరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, రేకులకుంట, రెడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

మహిళా విద్యకు అధిక ప్రాధాన్యం



సభలో మాట్లాడుతున్న ఎంపీ గోరంట్ల మాధవ్, చిత్రంలో ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ



కార్యక్రమానికి హాజరైన విద్యార్థినులు, అధ్యాపకులు

- జగనన్న పాలనలో అన్ని రంగాల్లోనూ మహిళలకు అగ్రస్థానం
- ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్
- రూ.8 కోట్లతో పాలిటెక్నిక్ కళాశాల న్యూ అకడమిక్ బ్లాక్ ప్రారంభం

హిందూపురం: మహిళలు చదువుకుంటే ఆ కుటుంబం బాగుపడుతుందని, అందువల్లే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళా విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో రూ.8 కోట్లతో నిర్మించిన న్యూ అకడమిక్ బ్లాక్‌ను ఎంపీ, ఎమ్మెల్సీలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు సీఎం జగన్ శ్రీకారం చుట్టారని, ముఖ్యంగా అమ్మాయిలు బాగా చదువుకోవాలన్న తలంపుతో వారికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించడం సాధ్యమవుతుందని, దీన్ని గుర్తించి ప్రభుత్వం సహకారాన్ని అందిపుచ్చుకుని భవితకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఇదే కళాశాలలో చదివి గత ఏడాది జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన ముస్కాన్‌ఖానులా ప్రతిఒక్కరూ ప్రతిభ చూపి హిందూపురానికే కాకుండా రాష్ట్రానికే వన్నె తేవాలని పిలుపునిచ్చారు. సత్యసాయిబాబా అంటున్నట్లు అమ్మాయిలు బంగారు తల్లులని, రేపటి భవిష్యత్తు నిర్మాతలన్నారు. సెల్‌ఫోన్ అనేది ప్రథమ శత్రువు, చిన్న మిత్రుడు అన్న రెండువిషయాలు గుర్తుపెట్టుకోవాలన్నారు. చదువుతోపాటు తల్లికి ఇంటిపనుల్లో సహాయపడాలన్నారు.

ఆరోగ్యకర పోటీతో లక్ష్యసాధన సులువు

ఆరోగ్యకర పోటీతో లక్ష్య సాధన సులువు అవుతుందని, ఈమేరకు ప్రతి విద్యార్థినీ తమ మిత్రులతో పోటీ పడి చదవాలని ఎంపీ, ఎమ్మెల్సీ సూచించారు. అపరిచిత పరిచయాలు, ప్రలోభాలకు ఆకర్షితులు కాకూడదన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్లు, ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, వాట్సాప్ చాట్స్‌కు దూరంగా ఉండటం చాలా మంచిదన్నారు. క్రమశిక్షణ, మంచిఅలవాట్లతో ఉన్నతశిఖరాలకు చేరుకోవాలన్నారు. మన భవిష్యత్తు మనచేతుల్లోనే ఉందన్న విషయాన్ని ప్రతి విద్యార్థినీ గుర్తుంచుకోవాలన్నారు. ఒకస్థాయికి చేరుకున్న తర్వాత కోరుకున్నవన్నీ వెతుక్కుంటువస్తాయన్నారు. అంతవరకు ఒకటే లక్ష్యంతో బాగా చదువుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ, కళాశాల అభివృద్ధికి తనవంతు సాయం అందిస్తానన్నారు. ప్రస్తుతం వాటర్‌ప్లాంట్‌తోపాటు స్పోర్ట్సు మెటీరియల్ అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, కళాశాల ప్రిన్సిపల్ హరిష్‌బాబు, ఈఈ శివకుమార్ వార్డు కన్వీనర్ మల్లికాభాను తదితరులు పాల్గొన్నారు.